క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి బీమా సాయం



బీమా సాయం అందజేస్తున్న నాయకులు

సదుం: మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన వలంటీర్ చిరంజీవి(30) కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం వైఎస్సార్ తక్షణ బీమా సాయం కింద రూ.10 వేలను అందజేశారు. ఇటీవల బ్లడ్ క్యాన్సర్‌తో చిరంజీవి మృతి చెందడం విదితమే. సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, సచివాలయ కన్వీనర్ జ్యోతిష్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ ముబారక్, నాయకులు మునిరాజ, రమేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడు మృతి



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న చైర్మన్, కమిషనర్

కుప్పం: కుప్పం మున్సిపాలిటీలో 20 ఏళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్న నరసింహులు (47) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మరణించారు. ఆయన మృతికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నియామకం



రవీంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా డి.రవీంద్రారెడ్డి నియమితులయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో సోమవారం జిల్లా మెడికల్, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ ప్రభావతీదేవి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ప్రాథమి ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డికి శాలువలు కప్పి గజమాలతో సత్కరించారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు ఎంపీపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ తనిఖీ



కుప్పం: ప్రజా పంపిణీ వ్యవస్థతో ప్రజలకు అందజేస్తున్న నిత్యాసర సరుకులను సివిల్ సప్లైస్ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి తనిఖీ చేశారు. సోమవారం పట్టణంలోని వాసుదేవ రోడ్డు రేషన్ కార్డు లబ్ధిదారులకు నిత్యాసర సరుకులు పంపిణీ చేస్తున్న వాహనాన్ని పరిశీలించారు. కార్డుదారులకు నేరుగా ఇంటి వద్దనే సరుకులు ఇవ్వాలని ఆదేశించారు.

నేడు కుప్పంలో 'ఆడుదాం ఆంధ్రా'

కుప్పం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం కుప్పంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, వివిధ క్రీడలను హాకింగ్ స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తామని, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్ ఈ పోటీలను ప్రారంభిస్తారని తెలియజేశారు.

క్రీడలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

రామకుప్పం: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, బ్యాడ్మింటన్ డబుల్స్, కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి 15 నుంచి 60 ఏళ్ల లోపు వారు స్థానిక సచివాలయంలోగానీ 1902 నంబరుకు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

6న అంబేడ్కర్ వర్ధంతి

సదుం: ఈ నెల 6న మండలంలోని గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో సోమవారం దళిత సంఘ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.

తుపానుపై అధికారులు అప్రమత్తం



వి.కోట : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ



పెద్దపంజాణి : సమీక్షిస్తున్న ఎంపీపీ



సోమల : అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

వి.కోట : తుపాను నేపథ్యంలో మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ యువరాజ్ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అధికారులు, సిబ్బందితో ఎంపీపీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, తుపాను ప్రభావంతో మండలంలో ఎక్కడా నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది, అధికారులు రైతులకు తగు సలహాలు-సూచనలు ఇవ్వాలన్నారు. ఎక్కడైనా పంటలకు నష్టం వాటిల్లితే అధికారులకు దృష్టికి తేవాలన్నారు. అలాగే రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ మహ్మద్ రఫీ, అధికారులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో మండలంలోని అధికారులందరూ అందుబాటులో ఉండాలని ఎంపీపీ ఎన్. రెడ్డెప్ప ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని రాయలపేట సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుని అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు మునిరాజా, పీఏస్‌లు గణపతి, జఫ్రుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తేలికపాటి వర్షాలు

గంగవరం: తుపాను ప్రభావంతో పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులు వీస్తున్నాయి. చలి ప్రభావం పెరిగి జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాల కారణంగా ఉద్యాన పంటలు టమాట, వంగ కాస్త దెబ్బతిని నష్టం వాటిల్లింది. వరి, రాగి, జొన్న పైర్లపై ప్రభావం పడకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

సోమలలో..

సోమల: తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకట నరసింహులు కోరారు. సోమవారం మండలంలోని నంజంపేట-కమ్మపల్లె మార్గమధ్యంలో ఉన్న గార్గేయ నది వంతెనను ఆయన పరిశీలించారు. ప్రజలు వాగులు, వంతెనలు దాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: తుపాను నేపథ్యంలో వీఆర్వోలందరూ గ్రామాల్లో రాత్రి పూట ప్రజలకు అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అమరనాథ్ ఆదేశించారు. సోమవారం ఆయన వీఆర్వోలతో తుపాను ప్రభావంపై సమీక్షించారు. మరో రెండ్రోజులు వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మండలంలో ఎక్కడా నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తమ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎక్కడైనా వర్షాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్నా, పంటలకుగానీ, ఇతరత్రా వాటికి నష్టం కలిగినా వెంటనే 9491077066 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. సమావేశంలో డీటీలు వెంకటరమణారెడ్డి, లోకేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు త్రీఫేజ్ కరెంటు : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు తోడ్పాటునిచ్చేందుకు ప్రతి గ్రామానికి మూడు ఫేజ్‌ల్లో కరెంటు సరఫరా చేయనున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అజెండాలోని పలు అంశాలపై చర్చించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో ప్రతి గ్రామంలోనూ నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 1200 విద్యుత్ పోల్స్ మార్చామన్నారు. అలాగే పరిశ్రమల కోసం గ్రామాల్లో ఉన్న సింగిల్ లైన్లను మార్చి మూడు లైన్ల విద్యుత్ సరఫరా పనులు ప్రారంభించినట్టు చెప్పారు.అలాగే గృహావసరాలకు సింగిల్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని, అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్లు ఇచ్చి, ఒకొక్కరికి 50 లీటర్ల మంచినీరు సరఫరా చేస్తామన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కింద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు పోటీలు నిర్వహించి, విజయవంతం చేయాలన్నారు. పల్లెల్లో నత్తల బెడదతో పంటలు దెబ్బతింటున్నాయని, దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖను ఆదేశించారు. వైఎస్సార్ క్రాంతి పథం కింద మండలంలోని మహిళా సంఘాలకు రూ.17.40 కోట్లు వివిధ పథకాల రూపేణా పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు అభివృద్ధి పనులు చేశామని, సంక్షేమ ఫలాలను అర్హులకు అందజేశామన్నారు. అతిధులుగా ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ నారాయణ, తహసీల్దార్ సీతారామన్, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ, సరోజమ్మ, కో-ఆప్షన్ మెంబర్ బాబ్‌జాన్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

వర్షంలో పంటలను ఒబ్బిడి చేయొద్దు



ఏడీ శివకుమార్

పుంగనూరు: తుపాను ప్రభావం మూలాన కురుస్తున్న వర్షాలలో రైతులు తమ పంటలను ఒబ్బిడి చేయరాదని ఏడీ శివకుమార్ కోరారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో వరి కోతలు కోయరాదన్నారు. వర్షపు నీటిలో పంటలు కోస్తే గింజ గట్టిపడకుండా మొలకెత్తడమే కాకుండా రంగు మారుతుందని, దీని కారణంగా గిట్టుబాటు ధర లభించదన్నారు. వర్షంలో తడిసిన పంటకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం, రెండు గ్రాముల మ్యాంకోజెట్‌ను లేదా ప్రోపికొనజోల్‌ను కలిపి పిచికారీ చేస్తే పంట రంగు మారదన్నారు. వరి పంటలను కోసి ఉంటే కట్టలు కట్టి టార్పాలిన్ పట్టలు వేసి కప్పాలని, అలాగే పంట తడిసి ఉంటే 25 కేజీల ఉప్పు ద్రావణాన్ని చల్లాలన్నారు. మరో 5 రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా రైతులు ఆర్‌బీకేలలోని సిబ్బందికి లేదా తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయండి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్నకుమారి

రొంపిచెర్ల: తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్నకుమారి ఆదేశించారు. సోమవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల శాఖ అధికారులు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఓటర్ల జాబితాను బీఎల్‌ఓలు మాత్రమే చేయాలన్నారు. ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు వలంటీర్లతో చేయించరాదన్నారు. ఓటర్ల జాబితా విషయంలో ఎవరైనా తప్పిదాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీఓ రాజేంద్ర, డీటీలు లోకేష్, వెంకటరమణారెడ్డి, ఆర్‌ఐ అబ్దుల్ ఖాదర్, బీఎల్‌ఓలు పల్లవి, సురేంద్ర, మహేష్, ముబారక్, ప్రసాద్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

248 మంది కొత్త ఓటర్ల నమోదు

చౌడేపల్లి: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, కొత్తగా వివాహమై అర్హత ఉన్న 248 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ మాధవరాజు సోమవారం తెలిపారు. అలాగే 262 మంది ఓటు హక్కు కలిగిన వారు మృతి చెందినట్లు గుర్తించి జాబితా నుంచి తొలగించినట్లు చెప్పారు. 201 మంది వివిధ ప్రాంతాల నుంచి ఒకే చోటుకు మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారని, ఆయా బీఎల్‌ఓలు, వీఆర్వోలు వాటిని పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

వి.కోట: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చిట్టిబాబు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 9వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని, దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ



పోలింగ్ బూత్‌లు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ గాండ్లపల్లెలో 171, 172, బూరగమందలో 188 నుంచి 191 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. అందిన క్లైములను పరిశీలించారు. అర్హులైన వారి నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు మార్పులు-చేర్పులకు వినతులు స్వీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డీఈ రమణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: మండలంలోని అమ్మగారిపల్లె, 79-ఏ చింతమాకులపల్లెలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, పీఎం ఆవాజ్ యోజన, పీఎం జన్‌ధన్ యోజన తదితర పథకాల గురించి ఎల్‌ఈడీ తెరపై గ్రామస్తులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరాములు, ఏఓ హరిప్రసాద్, ఏపీయం హరిప్రసాద్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు -ముగ్గురిపై కేసు

సోమల: అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు సోమవారం రాత్రి తెలిపారు. ఆయన కథనం.. పేటూరు పంచాయతీ ఎర్రగుంతలవారిపల్లె సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పెద్ద ఉప్పరపల్లె-2 వీఆర్వో మురళి ఫిర్యాదు చేయడంతో అదే గ్రామానికి చెందిన జయచంద్ర, మదన్‌మోహన్, శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జనారణ్యంలోకి జింక



గుడిపాల: మండలంలోని పాపసముద్రం గ్రామంలో సోమవారం సాయంత్రం ఓ జింక జనావాసంలోకి వచ్చింది. వీధికుక్కలు వెంటపడడంతో జింక దారి తప్పి వచ్చేసింది. గ్రామస్తులు కుక్కల బారి నుంచి దానిని సంరక్షించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు తెలియజేశారు.

నెక్కుందిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తదితరులు



పుంగనూరులో బుక్‌లెట్లతో ప్రచారం చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మండలంలోని నెక్కుంది సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి నిర్వహించారు. సోమవారం బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డితో కలసి సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అలాగే గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతలవీధిలో..

పుంగనూరు మున్సిపాలిటీలోని చింతలవీధి సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చైర్మన్ అలీమ్‌బాషా సోమవారం సాయంత్రం నిర్వహించారు. సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లను పంపిణీ చేసి చైర్మన్ మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తూ ప్రజాభిప్రాయం సేకరిస్తున్నట్టు చెప్పారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్లు రెడ్డెమ్మ, రేష్మా, సాజిదాబేగం, కాళిదాసు, సచివాలయ కన్వీనర్ వరదారెడ్డి బోయకొండ ఆలయ కమిటీ డైరెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు



ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

వి.కోట: అంగవైకల్యం శరీరానికే కానీ మనస్సుకు కాదని, ప్రత్యేక ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడారు. భవిత కేంద్రంలో దివ్యాగ పిల్లలకు విద్యాబోధన, ఫిజియోథెరపీ గురించి తెలియజేశారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల హెచ్ఎం పరకు రాములనాయుడు, ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ నాయక్, ఖాజీపేట ఎంపీపీ పాఠశాల హెచ్ఎం ఇలియాజ్, ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరి వ్రతం



వ్రత పూజలు చేస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయేశ్వరుడు

చౌడేపల్లి: మండల ప్రజలు కేదారేశ్వరీస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, కరణంవారిపల్లె అభయాంజనేయస్వామి, చిత్రెడ్డిపల్లెలోని రామాలయం తదితర ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో వ్రతపూజలకు హాజరయ్యారు. వేదపండితులు రాజశేఖర దీక్షితులు, ఆనందాచార్యుల ఆధ్వర్యంలో వ్రతమాచరించారు. అలాగే కార్తీక మాసం సోమవారం సందర్భంగా శివాలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

తెలంగాణలో జనసేన డిపాజిట్లు గల్లంతు



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో జనసేన పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా గల్లంతయ్యాయని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అపహాస్యం చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు సినిమా ఇమేజ్ తప్పితే రాజకీయ ఇమేజ్ లేదని తేలిపోయిందన్నారు. తెలంగాణలో పోటీ చేసిన 8 మంది జనసేన అభ్యర్థులకు 1000 నుంచి 5000 వరకు ఓట్లు మాత్రమే వచ్చాయని, దీన్ని బట్టి చూస్తే పవన్‌కళ్యాణ్ సత్తా ఏమిటో తెలిసి పోతుందన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన బర్రెలక్కకు వచ్చిన ఓట్లు కూడా జనసేనకు రాలేదని ఎద్దేవా చేశారు.జనసేనకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక, పొత్తులకు వెంపర్లాడుతోందని విమర్శించారు. ఎన్ని పార్టీలు కలసి వచ్చినా ఏపీలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, ప్రజల ఆశీస్సులు తమ పార్టీకే ఉన్నాయని ధీమాగా చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపుపై పుంగనూరు నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ధైర్యం ఉంటే కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని టీడీపీ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, సర్పంచ్ నాగిరెడ్డి, నాయకులు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వినియోగదారుల క్లబ్ ఏర్పాటు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, టీచర్లు

పులిచెర్ల(కల్లూరు):కల్లూరు హైస్కూల్లో సోమవారం విద్యార్థి వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేసినట్లు పర్యవేక్షకుడు వెంకటసిద్దులు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు డబ్బును పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహ కల్పించారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువు నాణ్యతను పరిశీలించాలన్నారు. అనంతరం వినియోగదారుల హక్కు చట్టం పోస్టర్లను ఆవిష్కరించారు. హెచ్ఎం వెంకట రమణారెడ్డి, ఉపాధ్యాయులు చలపతి, దేవేంద్రనాథ్‌రెడ్డి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.2.4 కోట్లు



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

శాంతిపురం: మండలంలో రోడ్లు భవనాల శాఖ పరిధిలోని రెండు రోడ్ల మరమ్మతులకు రూ 2.4 కోట్లు విడుదల అయ్యాయని ఆ శాఖ ఏఈ గోపాల్ నాయక్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ పట్టాభి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ ఏఈ మాట్లాడుతూ, గోవిందపల్లె నుంచి కొలమడుగు మీదుగా దండికుప్పం వరకు, గడ్డూరు క్రాస్ నుంచి బెండనకుప్పం మీదుగా కర్ణాటక సరిహద్దు వరకూ ఉన్న రోడ్లకు ఈ నిధులతో త్వరలో పనులు చేస్తామన్నారు. మిగతా రోడ్లు ఏవైనా దెబ్బతిని ఉంటే వాటి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ప్రభుత్వం ఆదేశించిందని, వడ్డివాని కొత్తూరు-కోనేరు కుప్పం మధ్య ఉన్న రెండు కల్వర్టులను స్థానికులు పూడ్చివేయడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు దెబ్బతిందన్నారు. తహసీల్దార్ కౌలేష్ మాట్లాడుతూ, జగన్న భూ రక్ష సమగ్ర భూ సర్వేలో ఏవైనా సమస్యలు గుర్తిస్తే వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఉపాధి హామీ ఏపీఓ అనిల్ కుమార్ మాట్లాడుతూ, కూలీల హాజరుకు బయోమెట్రిక్ విధానం త్వరలోనే అమలులోకి వస్తుందన్నారు. హార్టికల్చర్, సెరికల్చర్ తోటల అభివృద్ధి ద్వారా రైతుల ఆదాయం పెంచే పనులు చేపడతామన్నారు. పూల తోటలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.6,400 రాయితీ, మల్చింగ్ షీట్‌పై రూ.6వేలను ప్రభుత్వం ఇస్తోందని హార్టికల్చర్ ఆఫీసర్ డింపుప్రియ చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అర్హులైన వారు పంచాయతీ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.15వేలు ఇస్తామని ఈఓపీఆర్‌డి ఈశ్వరన్ తెలిపారు. అబకలదొడ్డి వీఆర్వో అందుబాటులో ఉండరని వైస్ ఎంపీపీ పట్టాభి, హార్టికల్చర్ రాయితీల గురించి సచివాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ వెంకట్రామరెడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు. బెండనకుప్పం చౌక దుకాణంలో దింపాల్సిన నిత్యావసర సరుకులు వేరే చోట దింపుతున్నారని ఎంపీటీసీ రవికుమార్ మండిపడ్డారు. ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ లైన్లను సరి చేయాలని సర్పంచ్ జనార్ధనరెడ్డి కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంపీడీఓ హేమమాలిని, కో-ఆప్షన్ సభ్యుడు నిస్సార్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.